క్లుప్తంగా

పక్షుల పండుగ ఏర్పాట్ల పరిశీలన


అధికారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనన్

దొరవారిసత్రం : పక్షుల పండుగ సందర్భంగా నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రంలో చేపట్టిన ఏర్పాట్లను గురువారం గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనన్ పరిశీలించారు. మూడు రోజుల పాటు నిర్వహించే పండుగ కోసం సందర్శకులను అలరించేలా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అలాగే వివిధ రకాల స్టాళ్ల ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ పక్షుల కేంద్రానికి వెళ్లే మార్గంలో వున్న టూరిజం సముదాయాన్ని శుభ్రం చేసి భారీ స్టేజీ ఏర్పాటు చేసి వివిధ కార్యక్రమాలు ప్రదర్శించనున్నట్టు తెలిపారు. తహసీల్దార్ శైలకుమారి, ఎఫ్ఆర్వో సౌజన్య, డీఈ చంద్రశేఖర్, సీఐ సంగమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

కోట : ఎన్బీకేఆర్ ఐఎస్టీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని నాన్‌టీచింగ్ స్టాఫ్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. విద్యానగర్‌లో గురువారం నాన్‌టీచింగ్ స్టాఫ్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సమావేశం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ ఎన్బీకేఆర్ ఐఎస్టీ యాజమాన్యం నాన్ టీచింగ్ ఉద్యోగులపై కక్ష సాధింపు ధోరణిని అవలంబిస్తోందని ఆరోపించారు. కొన్నేళ్లుగా ఉద్యోగులకు ఎలాంటి అలవెన్సులు ఇవ్వలేదని, దీంతో వారు లేబర్ కోర్టును ఆశ్రయించారని తెలిపారు. కోర్టు ఉద్యోగులకు అనుకూలంగా తీర్పు ఇచ్చినా యాజమాన్యం అమలు చేయలేదన్నారు. యాజమాన్యం నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఉద్యోగులు నిరాహార దీక్షలు చేయనున్నట్లు తెలిపారు. వారికి ఏఐటీయూసీ సంపూర్ణ మద్దతు ఇస్తోందన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు చంద్రశేఖరరెడ్డి, రాధాక్రిష్ణ, కాలేష, ప్రభాకర్ పాల్గొన్నారు.

ప్రతి గ్రామానికీ తాగునీరు అందాలి


అధికారులతో మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో విద్యారమ

వాకాడు/చిట్టమూరు (చిల్లకూరు) : వాకాడు, చిట్టమూరు మండలాల్లోని గ్రామాలకు తాగునీరు అందించాలని నెల్లూరు జెడ్పీ సీఈవో విద్యారమ అధికారులను ఆదేశించారు. ఆమె గురువారం చిట్టమూరు మండలంలోని స్వర్ణముఖి నది ఒడ్డున వున్న మంచినీటి పథకాలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ స్వర్ణముఖిలో నీరు ఉన్నందున వేసవిలో తాగునీటికి ఇబ్బంది ఉండదన్నారు. అయినప్పటికీ తాగునీటి పథకాల పరిస్థితిని సమీక్షిస్తున్నామని వివరించారు. మరమ్మతులు ఉంటే నివేదిక ఇవ్వాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ నందకుమార్‌కు సూచించారు. విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించాలని ఆదేశించారు. సర్పంచ్ పోలయ్య, జెడ్పీటీసీ చిప్పల వెంకటయ్య, గునపాటిపాళెం ఎంపీటీసీ ఫక్కీరయ్య, ఎంపీడీవో మనోహర్‌గౌడ్, పాల్గొన్నారు.

మహిళలకు ముగ్గుల పోటీలు



ముగ్గులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

నాయుడుపేట టౌన్ : మండలంలోని అత్తిమిట్ట గిరిజన కాలనీలో గురువారం నాయకులు ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పోటాపోటీగా ముగ్గులు వేశారు. వాటిని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ నాయకులతో కలిసి వీక్షించి ముగ్గులు వేసిన ప్రతి ఒక్కరినీ అభినందించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. మాజీ ఎంపీ సుబ్రమణ్యం, తహసీల్దారు రాజేంద్ర, ఎంపీడీవో సురేష్‌బాబు, సీడీపీవో ఉమామహేశ్వరి, నాయకులు సన్నారెడ్డి చంద్రారెడ్డి, గున్నం మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

చిల్లకూరులో..

చిల్లకూరు : గూడూరులోని రెండవ పట్టణ పరిధిలో ఉన్న జక్కా వెంకయ్య శ్రామిక నగర్‌లో గురువారం సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఇందులో గూడూరు తహసిల్దార్ చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సీపీఎం, సీఐటీయూ సంయుక్తంగా సీతారాం ఏచూరి స్మారకార్థం ముగ్గుల పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. మొదటి బహుమతి పి.మహాలక్ష్మీ, రెండో బహుమతి జి.సుప్రజ, మూడో బహుమతి కావేరి అందుకున్నారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా సీహెచ్ సుధారాణి, జి.వినీలా వ్యవహరించారు. జోగి శివకుమార్, టి.వెంకటరామిరెడ్డి, పుట్టా శంకరయ్య, పామంజి మణి, బీవీ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ముంపులోనే పొలాలు


చింతవరం వైపు ఉన్న పంట పొలాల్లో నిలిచి వున్న వరద నీరు

రోడ్లు బాగుంటే రవాణా పెరుగుతుంది. వస్తువులను ఒక చోటి నుంచి మరొక చోటికి తరలించడం ద్వారా రైతులకు మంచి ధర లభిస్తుంది. మార్కెట్‌లో వస్తువులు విరివిగా లభించడం ద్వారా ధరలు కూడా అందుబాటులో ఉంటాయి. అందుకే ప్రభుత్వాలు రోడ్లపై దృష్టి సారిస్తూ ఉంటాయి. చిల్లకూరు మండలంలో ఏర్పాటుచేస్తున్న సాగరమాల రోడ్డు రైతులకు శాపంగా మారింది. పనులు సక్రమంగా సాగకపోవడంతో భారీ వర్షాల వల్ల వచ్చిన వరదనీరు ఎక్కడికక్కడి నిలిచిపోవడంతో పొలాలు నీటిలోనే మునిగిపోయాయి. రెండు నెలలైనా నీరు తగ్గకపోవడంతో రైతులు పంటలు సాగు చేసుకునే వీలులేక లబోదిబోమంటున్నారు.

- రైతుల పాలిట శాపంగా మారిన సాగరమాల రోడ్డు
- రెండు నెలలు అవుతున్నా తగ్గని వరద నీరు
- వరినార్లు ముదురుతున్నాయని రైతుల ఆవేదన

చిల్లకూరు : మండలంలోని వరగలి క్రాస్ రోడ్డు ప్రాంతంలోని జాతీయ రహదారి నుంచి తీర ప్రాంతంలోని తూర్పుకనుపూరు వరకు సాగరమాల రోడ్డును నిర్మిస్తున్నారు. దీనికోసం సేకరించే భూముల గురించి అధికారులు రైతులకు అవగాహన కల్పించలేదు. ఈ ప్రాంతంలో వున్న సిలికా గనుల నుంచి వచ్చే సొనకాలువ ఊట నీరు, ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరద నీటితో చింతవరం, కొత్తపాళెం గ్రామాల్లో సుమారు 560 ఎకరాల భూములు ప్రతి ఏటా ముంపునకు గురవుతాయి. ఆ నీరు నెలలోగా చెన్నై మడుగు ద్వారా కండలేరు క్రీక్‌లోకి నీరు చేరుతుంది. తర్వాత రైతులు పొలాల్లో వరి సాగు చేసుకుంటారు. ఈ ఏడాది సాగరమాల రోడ్డు పనులు చేసే క్రమంలో పంట పొలాల మధ్య సుమారు 7 అడుగుల ఎత్తు వరకు మట్టి తోలారు. దీంతో వరద నీరు ముందుకు వెళ్లే అవకాశం లేక రెండు నెలలైనా అలాగే ఉంది. దీనిపై అవగాహన లేని రైతులు వరినాట్లు వేసుకునేందుకు నెల రోజుల క్రితం నారుమళ్లు సిద్ధం చేసుకున్నారు. నీరు ఇప్పటికీ అలాగే ఉండడం, నారు ఏపుగా పెరిగి ముదిరి పోతుండడంతో ఏమి చేయాలో దిక్కుతోచక రైతులు తలలు పట్టుకుంటున్నారు. పంట పొలాల్లో సుమారు మూడు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం చేపడుతున్నారు. వరద నీరు వెళ్లేందుకు ఎక్కడా తూములు ఏర్పాటుచేయలేదు.

సాధారణంగా పంట పొలాల్లో రోడ్డు నిర్మాణం చేపట్టేటప్పుడు ప్రతి 200 మీటర్లకు ఒక చోట బ్యాలెన్స్ ఇన్‌స్ట్రక్చర్ (తూములు) వేయాల్సి ఉంటుంది. అలాగే రోడ్డుకు రెండు వైపులా ఉన్న పంట పొలాల్లోకి రైతులు సులభంగా వెళ్లేందుకు బాక్స్ టైప్ బ్రిడ్జిలు నిర్మించాల్సి ఉంది. సాగరమాల రోడ్డు కాంట్రాక్టు సంస్థ ఈ దిశగా చర్యలు తీసుకోలేదు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ విషయంపై నీటి పారుదల శాఖ అధికారులు కూడా అవగాహన కల్పించకపోవడంతో ఈ ఏడాది పంట సాగుకు దూరం కావాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. అధికారులు, కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు స్పందించి పంట పొలాల్లోని నీరు దిగువకు వెళ్లేలా ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.


రోడ్డు పక్కన పొలాల్లో నిలిచిన వరద నీరు


ముదిరి పోతున్న వరినారు

ఈ ఏడాది సాగు కష్టమే



ప్రతి ఏటా వర్షాలు వచ్చిన సమయంలో చింతవరం, కొత్తపాళెం గ్రామాల వద్దనున్న భూములు వరద నీటితో పూర్తిగా మునిగిపోతాయి. నీరు చెన్నై మడుగు ద్వారా క్రమేపీ కండలేరు క్రీక్‌లోకి చేరుతుంది. తర్వాత మేము వరిసాగు చేసుకునే వీలుంటుంది. ఈ ఏడాది సాగరమాల రోడ్డు నిర్మాణం వల్ల పంట పొలాల్లో వరద నీరు తగ్గలేదు. వరినారు ముదిరిపోతోంది. ఈ దఫా పంట సాగు కష్టమే.

- నాశిన సుధాకర్, చింతవరం, కొత్తపాళెం

నార్లు పోసుకుని 40 రోజులు పైగా అయ్యింది



చింతవరం, కొత్తపాళెం గ్రామాలకు చెందిన రైతులకు పడవ అనే ప్రాంతంలో సుమారు 560 ఎకరాల వరకు భూమి ఉంది. దీని మధ్యలో సాగరమాల రోడ్డు వేస్తున్నారు. ఇది ఎత్తు ఎక్కువగా ఉండడంతో పొలాల గుండా వెళ్లే వరద నీరు ముందుకు కదలలేని స్థితి. వర్షాకాలంలో నాట్లు వేసుకునేందుకు 40 రోజుల క్రితం నారు పోసుకున్నాం. నారు ముదిరిపోయి పనికి రాకుండా పోతోంది.

- మేరా నాగరాజు, చింతవరం కొత్తపాళెం

విచ్చలవిడిగా కోడి పందేలు

చిల్లకూరు : సంక్రాంతి పండుగను పురస్కరించు కుని చిల్లకూరు మండలంలో విచ్చలవిడిగా కోడి పందేలు నిర్వహిస్తున్నారు. అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గ్రామాల్లో ఉన్న నాయకులు తమ ఇష్టం వచ్చినట్టు వ్యవహరిస్తూ రూ.లక్షలు పెట్టి కోడి పందేలు ఆడిస్తున్నారు. ఈ క్రమంలోనే ఏరూరు గ్రామంలో రెండు రోజులుగా కోడి పందేలు నిర్వహిస్తున్నారు. ఇక్కడికి కోట, వాకాడు ప్రాంతాల నుంచి జూదరులు పాల్గొంటున్నట్లు సమాచారం. పోలీసులు అటు వైపు కన్నెత్తి చూడకపోవడం పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అదేవిధంగా భోగి పండుగ రోజున బల్లవోలులో స్థానిక ప్రజాప్రతినిధి అండతో టీడీపీ నాయకులు పెద్ద ఎత్తున కోడి పందేలు చేపట్టారు. చివరిలో వర్షం కురవడంతో పందేలు రద్దు చేసుకున్నారు. అది కొనసాగి ఉంటే రూ.కోట్ల లావాదేవీలు జరిగేవని స్థానికులు చెబుతున్నారు. గతంలో ఈ ప్రాంతంలో కోడి పందేలు పెద్దగా జరిగేవి కాదని, కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ పార్టీ నాయకులు కోనసీమ సంస్కృతిని తీసుకువచ్చారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు పూర్తి స్థాయిలో దృష్టి సారించి కోడి పందేల నిర్వహణను కట్టడి చేయాలని కోరుతున్నారు.

గిరిజనులకు దుప్పట్ల పంపిణీ



చిట్టమూరు (చిల్లకూరు) : చిట్టమూరు మండలం కోగిలి పంచాయతీ రాఘవేంద్రపురంలోని గిరిజన కాలనీలో పేదలకు గురువారం నెల్లూరుకు చెందిన మహతి పెయింట్స్ అధినేత దుప్పట్లు పంపిణీ చేశారు. చిట్టమూరులోని టీఎంఆర్ పాఠశాల కరస్పాండెంట్ రహంతుల్లా మాట్లాడుతూ మహతి పెయింట్స్ అధినేత మురుగేషన్ కుమారుడు పుట్టిన రోజు సందర్భంగా దుప్పట్లు అందించినట్టు తెలిపారు. పాఠశాల మేనేజర్ శీనయ్య పాల్గొన్నారు.

ఫల సరుకుల పంపిణీ

గూడూరు రూరల్: గూడూరులోని డీఎస్ఆర్ కమ్యూనిటీ హాల్‌లో గురువారం వైజేపీ లయన్స్ క్లబ్ సభ్యులు పేదలకు ఫల సరుకులు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షులు మనోజ్‌కుమార్, మురళీరాజు, సుబ్రమణ్యం యాదవ్, శ్రీనివాస్‌యాదవ్, పసుపులేటి ప్రసాద్, ఆర్‌వీరావ్, రవీంద్రరెడ్డి, వేణురెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం


ఆత్మీయ సమావేశంలో పూర్వ విద్యార్థులు

బాలాయపల్లి (సైదాపురం) : బాలాయపల్లి మండలం జయంపు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1982–83లో పదో తరగతి చదివిన వారు గురువారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఎక్కడెక్కడో స్థిర పడిన వారు సుమారు 42 ఏళ్ల తర్వాత ఒకచోట చేరి సందడి చేశారు. చిన్నప్పుడు తరగతి గదిలో చేసిన అల్లరిని గుర్తు చేసుకున్నారు. మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. స్నేహితులను పేరు పేరునా పలుకరించి ఆత్మీయతను పంచుకున్నారు. తమకు విద్య నేర్పిన గురువులను స్మరించుకున్నారు. పాఠశాలకు రూ.35 వేలు విలువ చేసే మైక్‌సెట్‌ను వితరణ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు టీవీరమణయ్య, ఎస్ఎంసీ కమిటీ చైర్మన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు పరామర్శ


కందాటి కళ్యాణి తల్లితో మాట్లాడుతున్న నేదురుమల్లి


కూల్చివేసిన ఇళ్లను పరిశీలిస్తున్న నేదురుమల్లి

వెంకటగిరి రూరల్ : వెంకటగిరిలోని పలువురు వైఎస్సార్ సీపీ కార్యకర్తల కుటుంబ సభ్యులను గురువారం నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పరామర్శించారు. 15వ వార్డు అరవ బ్రహ్మణవీధికి చెందిన పెట్లూరు రమణారెడ్డి ఆరోగ్యంపై ఆరా తీశారు. ఇటీవల మృతిచెందిన 16వ వార్డు తాజ్ వీధిలోని వైఎస్సార్ సీపీ నాయకుడు దొంతు వెంకటేశ్వర్లు, 9వ వార్డుకు చెందిన మాజీ కౌన్సిలర్ గడ్డం రాఘవరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అలాగే ఉపాధ్యాయనగర్‌లో ఇల్లు కూల్చివేయడంతో మృతి చెందిన చిల్లకూరు శివరామిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని కుమార్తె, కౌన్సిలర్ కందాటి కళ్యాణికి భరోసా ఇచ్చారు. అనంతరం మున్సిపల్ అధికారులు కూల్చివేసిన పేదల ఇళ్లను పరిశీలించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దొంతుశారద, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్ బాలయ్య, కౌన్సిలర్లు వహిదా, సుబ్బారావు, కళ్యాణి, రాజారెడ్డి, దొంతుబాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెమింగో ఫెస్టివల్ విజయవంతానికి కృషి చేయండి


మాట్లాడుతున్న డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట, నేలపట్టు, అటకానితిప్ప, తడ, శ్రీసిటీ కేంద్రాలుగా ఈ నెల 18 నుంచి మూడు రోజులు నిర్వహించనున్న ఫ్లెమింగో ఫెస్టివల్–2025ను విజయవంతానికి అధికారులు సమష్టిగా పనిచేయాలని డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ తెలిపారు. ఆయన గురువారం సూళ్లూరుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అన్ని శాఖల అధికారులతో కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2001 నుంచి 2020 వరకు ఫ్లెమింగో ఫెస్టివల్‌ను నిర్వహించినట్టు తెలిపారు. నాలుగేళ్ల తర్వాత ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నామని, అందరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. పర్యాటకులకు వసతులు కల్పించాలని, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. మెప్మా పీడీ రవీంద్ర, ఆర్డీవో కిరణ్మయి పాల్గొన్నారు.

తాగునీరు ఉచితంగా ఇవ్వాలి

పెళ్లకూరు : మండలంలోని చిల్లకూరులో ఏర్పాటు చేసిన రెండు మినరల్ వాటర్ ప్లాంట్ల నుంచి నీటిని గ్రామస్తులకు ఉచితంగా ఇవ్వాలని డీసీసీబీ మాజీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి డిమాండ్ చేశారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ గతంలో గ్రామంలో వీపీఆర్ ఫౌండేషన్ కింద ఒక ప్లాంట్, మండల పరిషత్ నిధులు, తమ సొంత నిధులతో మరొక ప్లాంట్‌ను ఏర్పాటుచేసినట్టు తెలిపారు. వాటి ద్వారా ప్రజలకు ఉచితంగా తాగునీరు ఇవ్వాలని కోరారు. పంచాయతీ ఆధ్వర్యంలో ఉన్న వాటర్ ప్లాంట్‌ను నెలకు రూ.60 వేల సొంత నిధు లు వెచ్చించి నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. వీపీఆర్ ఫౌండేషన్ కింద ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను నిర్వహిస్తున్న అధికార పార్టీ నాయకులు 10 లీటర్ల క్యాన్‌కు రూ.20 చొప్పున వసూలు చేస్తున్నారని ఆరోపించారు. దీంతో ఉచితంగా తాగునీరు అందిస్తున్న వాటర్ ప్లాంట్‌పై భారం పడుతోందన్నారు. అంతేగాక వీపీఆర్ ఫౌండేషన్ వాటర్ ప్లాంట్ వద్ద నగదు వసూలు చేయడం వల్లే గ్రామంలో వివాదాలు జరుగుతున్నాయన్నారు. రెండు వాటర్ ప్లాంట్ల నుంచి గ్రామస్తులకు ఉచితంగా తాగునీరు అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యార్థినికి ఎమ్మెల్యే అభినందన


విద్యార్థిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

గూడూరు రూరల్ : గూడూరు రూరల్ పరిధిలోని తిమ్మసముద్రానికి చెందిన నారిపాక మానస జాతీయ స్థాయిలో జరిగే టెన్నికాయిట్ పోటీలకు ఎంపికైంది. ఆమెను గురువారం గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అభినందించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల్లోని ప్రతిభపాటవాలను వెలికి తీస్తే అనేక విజయాలు సాధిస్తారని పేర్కొన్నారు. ఈ నెల 31న చెన్నైలో జరిగే జాతీయ స్థాయి టెన్నికాయిట్ పోటీల్లో పాల్గొననున్న నారిపాక మానసకు తనవంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో టెన్నికాయిట్ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు మయూరి శ్యామ్, కార్యదర్శి రమ్య, పైడి కోటేశ్వరరరావు, భాస్కర్, కరీముల్లాఖాన్, రమేష్ పాల్గొన్నారు.

వేమన మార్గం అనుసరించాలి

గూడూరు రూరల్ : యోగి వేమన చూపిన మార్గాన్ని అనుసరించాలని త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచార కమిటీ సభ్యులు కోరారు. వారు గురువారం గూడూరు రూరల్‌లోని చెన్నూరులో యోగి వేమన పుస్తకాలు పంచిపెట్టారు. వారు మాట్లాడుతూ యోగి వేమన తన పద్యాలతో ప్రజలకు దైవ మార్గాన్ని వివరించారని, ఆయన రాసిన పద్యాలలోని భావాన్ని తెలుసుకుని నడుచుకోవాలని సూచించారు.

కండలేరులో 55.952 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 55.952 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరుకు సోమశిల జలాశయం నుంచి 180 క్యూసెక్కుల నీరు వస్తుందని తెలిపారు. అలాగే కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 900, లోలెవల్ కాలువకు 10, హైలెవల్ కాలువకు 110, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా శ్రీమహాలక్ష్మి గ్రామోత్సవం



కోట : కోటలో ప్రతి ఏటా సంక్రాంతికి అమ్మవారి బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా గురువారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన రథంపై కొలువుదీర్చి గ్రామోత్సవం చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు.

కోడి పందెం రాయుళ్ల అరెస్టు

సైదాపురం : మండలంలో అనంతమడుగు, కొమ్మిపాడు గ్రామాల్లో కోడిపందెం స్థావరాలపై గురువారం పోలీసులు ముమ్మరంగా దాడులు చేశారు. ఎస్ఐ క్రాంతికుమార్ మాట్లాడుతూ ముందుగా అందిన సమాచారం మేరకు అనంతమడుగు, కొమ్మిపాడు గ్రామాల్లో దాడులు చేశామని తెలిపారు. అనంతమడుగులో ఐదుగురిని అరెస్టు చేసి ఒక కోడి, రూ.4,600 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే కొమ్మిపాడులో ఇద్దరిని అదుపులోకి తీసుకుని రెండు కోళ్లు, రూ.1,600 నగదును స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు.

తప్పుచేసిన వారిని వదిలే ప్రసక్తే లేదు


కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

- అక్రమ కేసులకు బెదరం
- నిరంతరం పోరాటాలు చేస్తాం
- నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి


గజమాలతో నేదురుమల్లిని సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

వెంకటగిరి(సైదాపురం) : అధికారులు ప్రజలకు సేవ చేయడం మరిచి కూటమి నేతల సేవలో తరలిస్తున్నారని, వారి అత్యుత్సాహానికి నిండు ప్రాణం బలైందని వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. ఆయన గురువారం నేదురుమల్లి నివాసంలోని ఎన్‌జేఆర్ భవనంలో నియోకవర్గంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభు త్వం చేస్తున్న అన్యాయాలు, దౌర్జన్యాలకు ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చ రించారు. అధికారులు కూటమి నేతల తొత్తులుగా వ్యవహరిస్తూ పేద ప్రజలపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని దుయ్యబట్టారు. తప్పు చేసిన అధికా రి రాష్ట్రంలో ఎక్కడున్నా వదిలిపెట్టమన్నారు. వెంకటగిరిలో ఆక్రమణల తొలగింపు పేరుతో నోటీసులు ఇవ్వ కుండా ఇళ్లను కూల్చివేశారని, దీంతో బాధితు డు గుండెపోటుతో మరణించాడని వాపోయారు. ఉపాధ్యాయ కాలనీలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకుని అతిపెద్ద బంగ్లా నిర్మించుకున్న వారిని వదిలేశారని, పైగా ఆ భవనానికి రెగ్యులైజేషన్ కూడా చేశారని పేర్కొన్నారు. తాము శాంతియుతంగా ర్యాలీ చేస్తుండగా కూటమి నేత తన వాహనంతో ర్యాలీని అడ్డుకుని రభస చేశాడన్నారు. మరుసటి రోజు తనతోపాటు మరో 11 మందిపై అక్రమ కేసులు నమోదు చేశారని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్త పేచీరాజ్‌ను అన్యాయంగా గంజాయి కేసులో ఇరికించారని గుర్తు చేశారు. దీనిపై కోర్టును ఆశ్రయించామని, త్వరలో నిజానిజాలు వెలుగులోకి వస్తాయన్నారు. 2027లో జమిలీ ఎన్నికలు వస్తాయని, వైఎస్సార్ సీపీ అఖండ మెజారిటీ సాధించి జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి అవ్వడం ఖాయమని జోస్యం చెప్పారు. వైఎస్సార్‌సీపీది రెడ్‌బుక్ పాలన కాదని, గుడ్‌బుక్ పాలన అని పేర్కొన్నారు.

సూపర్ సిక్స్ పథకాల ఊసే లేదు

కూటమి నేతలు ఎన్నికల ముందు సూపర్ సిక్స్ అంటూ ప్రజలను నమ్మించారని, అధికారంలోకి వచ్చి ఏడు నెలలైనా పథకాల ఊసే లేదన్నారు. ప్రతి నెలా పింఛన్లు తొలగించి పేదల కడుపు కొడుతున్నారని దుయ్యబట్టారు. నిరంతరం ప్రజల్లో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేస్తామన్నారు. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి, సైదాపురం, రాపూరు మండల కన్వీనర్లు పులి ప్రసాద్‌రెడ్డి, కాల్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, చింతల శ్రీనివాసులురెడ్డి, వెందోటి కార్తీక్‌రెడ్డి, మన్నారపు రవికుమార్ యాదవ్, మధుసూదన్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ సేతరాసి బాలయ్య, కౌన్సిలర్లు వహిదా, ఆరిశంకరయ్య, సుబ్బారావు, సొసైటీ మాజీ అధ్యక్షులు మోహన్‌రావు, శివకుమార్, మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి యస్థానిబాషా తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

పెళ్లకూరు : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రమీలారాణి తెలిపారు. ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

కనుల పండువగా ఆదిలక్ష్మిదేవి వన మహోత్సవం


ఆదిలక్ష్మిదేవికి ఉత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

రాపూరు : మండలంలోని పెంచలకోనలో వెలసిన పెనుశిల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కొలువైన ఆదిలక్ష్మిదేవికి గురువారం రాత్రి శ్రీవారి నందన వనంలో వన మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మకర సంక్రాంతి తర్వాత వచ్చే ముక్కనుమ రోజు ఆదిలక్ష్మిదేవికి వన మహోత్సవం నిర్వహించడం ఆనవాయితీ అని ప్రధానార్చకులు పెంచలయ్యస్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఆదిలక్ష్మిదేవి ఉత్సవమూర్తిని పద్మపీఠంపై కొలువుదీర్చి విశేషంగా అలంకరించారు. తదుపరి మేళతాళాలు, మంగళవాయిద్యాల మధ్య నందన వనంలోకి తీసుకెళ్లారు. అక్కడున్న మండపంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, ఆస్థాన సేవ చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
గూడూరు : 90108 97733, 99122 20591
వెంకటగిరి : 99122 20591
సూళ్లూరుపేట : 90102 23710